సాక్షి
నంద్యాల
బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025




## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన బృందం రూ.1,00,116 విరాళంగా అందజేసింది.



## అహోబిలేశుడికి నీరాజనం

ఆళ్లగడ్డ: లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ మంగళవారం దేవరాయపురం గ్రామంలో కొలువుదీరింది. గ్రామస్తులు పల్లకికీ స్వాగతం పలికి తెలుపు వద్దకు తరలించారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,613.60 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 45.167 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 000 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 6,813 |

## న్యూస్‌రీల్

### పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ

ఆత్మకూరు: ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ పి.జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు చెప్పారు. మంగళవారం ఆయన ఆత్మకూరు మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు రాస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. సరిగా లేకపోవడంతో వంట సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వంట బాగా వండాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

### కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 2,501 మందికి గాను 2,407 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 2001 మందికి గాను 1966 మంది హాజరైనట్లు డీఐఈఓ సునీత తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వెల్లడించారు.

### పెన్షనర్ల సంఘం ఎన్నికలు వాయిదా

నంద్యాల(అర్బన్): ఈనెల 14న జరగాల్సిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నికలు వాయిదా వేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నికల అధికారి పెద్దన్నగౌడ్ మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు గత నెల 30వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చామని ఓటర్లు బ్యాలెట్ ద్వారానే అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకునేలా ఎన్నికలు జరపా లని నిర్ణయించామన్నారు. బ్యాలెట్ ద్వారా కొందరు బైలాస్ ద్వారా మరికొందరు ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తులు ఇచ్చారన్నారు. ఇందు కోసం ఎన్నికల నిర్వహణ తేదీని వాయిదా వేశామని, తదుపరి ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర సంఘం ఆదేశానుసారం ప్రకటిస్తామన్నారు. ముచ్చటగా మూడోసారి ఎన్నికలు వాయిదా పడటంతో ఇప్పటికే ప్రచారంలో జోరుగా తిరిగిన నాయకులు డీలా పడిపోయారు.

### దివ్యాంగులకు వైద్య పరీక్షలు

గోస్పాడు: పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డీఎంహెచ్ఓ వెంకటరమణ, సూపరింటెండెంట్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో దివ్యాంగుల వైద్యపరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నంద్యాల, గోస్పాడు, బనగానపల్లె, డోన్ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు ప్రత్యేకంగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### కేసీకి నిలిచిన నీటి సరఫరా

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో సుంకేసుల బ్యారేజ్‌కు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మంగళవారం నుంచి కేసీ కెనాల్ ఆయకట్టుకు నీటి విడుదలను అధికారులు బంద్ చేశారు. ఈ కాలువ పరిధిలో రబీలో సుమారుగా 90,200 ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి.



# కూటమి నైపుణ్యం..




# నిరుద్యోగ పర్వం

'ఉన్నత చదువులు చదివినా సరైన స్కిల్స్ లేక పోవడంతో యువతకు ఉద్యోగాలు రావడం లేదు.. ప్రపంచంలో ఇప్పటి వరకు జనాభా లెక్కలు చేశారు. కులాల వారీగా లెక్కలు తీశారు. మొదటిసారిగా స్కిల్ గణనకు శ్రీకారం చుడుతాం. దేశంలో ఏఏ ఉద్యోగాలు ఉన్నాయి.. దానికి తగ్గట్టుగా స్కిల్స్ ఉన్నాయా లేదా అనే దానిని లెక్కిస్తాం.. యువతకు ఉపాధి చూపిస్తాం' అంటూ సరిగ్గా ఎనిమిది నెలల క్రితం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపడుతూ హామీ ఇచ్చారు. నైపుణ్య గణనకు సంబంధించి 5వ సంతకం చేశారు. ఆ తర్వాత హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఓ వైపు నిరుద్యోగం పెరుగుతోంది. ఉపాధి అవకాశాల కోసం యువత నిరీక్షిస్తోంది.

- డీలా పడిన స్కిల్ హబ్‌లు, స్కిల్ కాలేజీలు
- జాబ్‌మేళాతో సరిపెడుతున్న వైనం
- ప్లేస్‌మెంట్ పొందినా నైపుణ్యం లేక ఇంటిముఖం
- నీరుగారిన సీఎం చంద్రబాబు 5వ సంతకం
- ఆందోళనలో నిరుద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలకు గండికొడుతోంది. యువతలో నైపుణ్యాలను పెంచితే వారు ఉపాధి అవకాశాల్లో రాణించే అవకాశం ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లు అలంకార ప్రాయంగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణ కార్యక్రమాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో 506 మంది, నంద్యాల జిల్లాలో 487 మంది శిక్షణ పొందుతున్నట్లు లెక్కలు ఉన్నాయి. కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రాన్ని స్కిల్ కాలేజీగా కొనసాగిస్తున్నా రొటీన్‌గా జరిగే శిక్షణ కార్యక్రమాలు మినహా ఇతరత్రా నైపుణ్యాలను పెంచే శిక్షణ లేకపోవడం గమనార్హం. నంద్యాల జిల్లాలో అస్సలు స్కిల్ కాలేజీ లేదు. నైపుణ్య గణన చేపట్టి నిరుద్యోగులకు దేశ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. మోడల్‌గా మంగళగిరిలో నైపుణ్య గణన చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే, అక్కడ వ్యతిరేక ఫలితాలు రావడంతో ముందడుగు వేయలేదని తెలుస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతూ చేసిన సంతకాల్లో నైపుణ్య గణన 5వ సంతకం. మొదటి సంతకం మెగా డీఎస్సీకే ఇప్పటి వరకు మోక్షం లేదు. మిగతా సంతకాలు ఇంకెక్కడ అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నేటికీ స్కిల్స్ పెంచే శిక్షణ కార్యక్రమాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత దిక్కు తోచని స్థితిలో ఉండిపోయింది. యువగళం నిధి కింది నిరుద్యోగులకు నెలకు రూ.3000 ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించి మోసం చేశారు. కూటమి నేతల హామీలు అన్నీ గాలి మాటలుగా మిగిలిపోవడంతో యువత మండిపడుతోంది.



### పోతున్నారు.. వెనక్కి వస్తున్నారు...

డీఆర్‌డీఏ, ఎంప్లాయిమెంట్, ఏపీఎస్ఎస్‌డీసీ సెప్టెంబర్ నుంచి నియోజక వర్గాల వారీగా నెలకు 8 ప్రకారం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ ప్లేస్‌మెంట్లు అతి తక్కువగా ఉంటున్నాయి. జాబ్ మేళా ద్వారా వివిధ ప్రైవేటు కంపెనీల్లోకి ఇటు వెళ్లి.. అటు తిరిగి వచ్చేస్తున్నారు. సీడ్ యాప్ లెక్కల ప్రకారం సెప్టెంబర్ నెలలో 429 మందికి, అక్టోబరులో 374, నవంబరులో 159, డిసెంబరులో 191 మందికి ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెబుతున్నా.. ఇందులో సగం మంది ఉద్యోగాల్లో చేరలేదు. చేరిన వారు పని ఒత్తిడి, అంతంత మాత్రం వేతనాలు ఉండటంతో నెల, రెండు నెలలకే ఇంటికొచ్చేస్తున్నారు. తగిన స్థాయిలో నైపుణ్యాలు మెరుగుపరిచి ప్లేస్‌మెంట్ చూపితే ప్రయివేటు ఉద్యోగాలైనా కొనసాగే అవకాశం ఉంది. స్కిల్స్ లేకపోవడంతో నిరుద్యోగులు రాణించలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

### కేంద్రం నుంచి సహకారం శూన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యువతలో నైపుణ్య శిక్షణ కోసం కేంద్రం దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) కింద సహకారం లభించేది. కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి అయినప్పటికీ ఇంతవరకు డీడీయూజీకేవైకి కేంద్రం ఆన్‌లైన్‌లో ఆమోదం లభించ లేదు. కేంద్రప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. 2014 - 19 మధ్య పరిస్థితులే మళ్లీ పునరావృతమవుతున్నాయి. కాగితాలపై మాత్రం అన్ని ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఏమీ ఉండని పరిస్థితి. అప్పట్లో నిరుద్యోగుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణల పేరుతో టీడీపీ పాలకులు భారీగా నిధులు కొల్లగొట్టారనే విమర్శలు ఉన్నాయి.

### గత ఐదేళ్లలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేసి షెడ్యూలు ప్రకారం యువతలో నైపుణ్యాలను పెంచేందుకు శిక్షణ ఇవ్వడం, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంటు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ జనరల్ తదితర వాటిల్లో నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణ కార్యాక్రమాలు జరిగాయి. స్కిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు అన్ని హబ్‌ల్లో ప్రత్యేకంగా ల్యాబ్‌లు కూడా ఏర్పాటు కావడం విశేషం. స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారు దేశ వ్యాప్తంగా వివిధ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో నేటికి కూడా రాణిస్తుండటం విశేషం. ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 18,157 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. కర్నూలు జిల్లాలో 9,520, నంద్యాల జిల్లాలో 8,637 మందికి ఉద్యోగాలు లభించాయి.

**జిల్లాలో స్కిల్ హబ్‌ల వివరాలు**

| నియోజకవర్గం | హబ్ ఏరియా |
|---|---|
| డోన్ | న్యాక్ ట్రైనింగ్ సెంటర్, జీఐటీఐ |
| నంద్యాల | పీఎస్‌సీ, కేవీఎస్‌సీ జీడీసీ |
| ఎర్రగుంట్ల | జీటీఆర్ఎం జీడీసీ |
| ఆత్మకూరు | జీడీసీ |
| నందికొట్కూరు | జీడీసీ |

### నైపుణ్య గణన ఊసే లేదు



ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత హామీలను మరచిపోయారు. మొదటి ఐదు సంతకాలలో భాగంగా నైపుణ్య గణన చేపట్టి దేశ వ్యాప్తంగా అర్హులకు తగిన ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. ఇంతవరకు నైపుణ్య గణన ఊసే లేకపోవడం ఆందోళనకరం. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు పూర్తయినా ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు.

– చంద్రప్ప, రాష్ట్ర అధ్యక్షులు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్

### ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైఫల్యం



ఎన్నికల సమయంలో చంద్రబాబు నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రిగా పదవి స్వీకరించి 8 నెలలు పూర్తయినా నిరుద్యోగులకు ఒక్క ఉపాధి అవకాశం కూడా కల్పించలేదు. జాబ్ క్యాలెండర్ ఊసే లేకుండాపోయింది. ఉపాధి అవకాశాలు కల్పించకపోతే అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై ఉద్యమాన్ని లేవదీస్తాం.

– పగడాల ఆనంద్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్

### శిక్షణ తరగతులు జరుగుతున్నాయి

నియోజకవర్గాల వారీగా స్కిల్ హబ్‌లు యథావిధిగా పనిచేస్తున్నాయి. ప్రస్తుతం అన్ని స్కిల్ హబ్‌ల్లో నైపుణ్యాలను పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ట్రైనింగ్ పూర్తయిన వారికి ప్రైవేటు కంపెనీలో ప్లేస్‌మెంట్ కూడా చూపుతున్నాం. నైపుణ్య గణన అనేది రాష్ట్ర ప్రభుత్వ పాలసీ. ఇప్పటివరకు నైపుణ్య గణనపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. ప్రభుత్వం ఆదేశాలిస్తే వెంటనే చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

– రాజ్‌కుమార్, జిల్లా అధికారి, డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కర్నూలు

## ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

మహానంది: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. గాజులపల్లె, అల్లినగరం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటల దిగుబడులకు డిమాండ్ ఉందన్నారు. రైతులు వరిపంటకు అవసరమైన మేరకే ఎరువులు వాడాలన్నారు. రబీలో పంట నమోదు పూర్తవుతుందన్నారు. నమోదు చేయించుకున్న రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సొంత పొలం కలిగిన రైతులకు విశిష్ట సంఖ్యను ఇస్తున్నామని, రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆలయన వెంట ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ నరేంద్రారెడ్డి, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## మహానందిలో నేడు టెండర్లు

మహానంది: మహానందిలో బుధవారం టోల్‌గేట్ల నిర్వహణ, భక్తులు పాదరక్షలు భద్రపరుచుకునేందుకు, కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకునేందుకు, తలనీలాలు, క్లాక్‌రూమ్‌ల నిర్వహణతో పాటు అభిషేక సామగ్రి, కొబ్బరికాయల విక్రయం, తదితర వాటికి సీల్డ్, బహిరంగ టెండర్లు నిర్వహించనున్నారు. టెండర్లలో పాల్గొనేందుకు మహానంది మండలానికి చెందిన పలువురితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సీల్డ్ టెండర్ల కోసం అన్ని విభాగాలకు ఆసక్తి కలిగిన వారు షెడ్యూలు తీసుకున్నారు. సీల్డ్ టెండర్లు తీసుకున్నవారి వివరాలు గోప్యంగా ఉంచి ఆలయానికి ఆదాయం పెంచాల్సిన ఉద్యోగుల్లో ఓ ఉద్యోగి వారి వివరాలను కూటమి నేతకు చేరవేయడం విమర్శలకు తావిస్తోంది.

## ఐదుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు డీటీఆర్‌బీలో పనిచేస్తున్న విజయలక్ష్మి కర్నూలు మహిళా పీఎస్, అక్కడున్న ఆదిలక్ష్మి కర్నూలు డీటీఆర్‌బీకి బదిలీ అయ్యారు. అలాగే నంద్యాల సీసీఎస్‌లో ఉన్న రాజా అన్నమయ్య జిల్లా రాజంపేటకు, అక్కడున్న కె.యల్లమ రాజును అన్నమయ్య వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే అన్నమయ్య ఎస్‌బీ-2లో ఉన్న సత్యనారాయణ మదనపల్లె రూరల్‌కు బదిలీ అయ్యారు.

## 'సూక్ష్మ' లక్ష్యం.. ప్రగతిలో నిర్లక్ష్యం

- మొదట్లో ఒక్కో జిల్లాలో 15 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించే విధంగా ఆదేశాలు
- తాజాగా 7 వేల హెక్టార్లకు తగ్గించిన వైనం
- తగ్గించిన లక్ష్యంలో 50 శాతం కూడా కనిపించని ప్రగతి



కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తగ్గించింది. మొదట్లో సూక్ష్మ సేద్యానికి పెద్ద పీట వేస్తున్నామని వ్యవసాయ అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కర్నూలు జిల్లాలో 15 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 15 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పిస్తున్నామని ఊరించారు. అందంతా ఒట్టిదేనని తేలిపోయింది. కర్నూలు జిల్లాలోనే 16 వేల మందికి పైగా రైతులు 15,800 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించుకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొదట్లో ఘనంగా లక్ష్యాలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత వాటిని తుస్ మనిపించింది. తాజాగా లక్ష్యాలను కర్నూలు జిల్లాకు 7,000, నంద్యాల 7,000 హెక్టార్లకు కుదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు మొదట్లో 30 వేల హెక్టార్లకు బిందు, తుంపర్ల సేద్యం కల్పించే విధంగా లక్ష్యాన్ని ఇ చ్చింది. తాజాగా లక్ష్యాన్ని 14 వేల హెక్టార్లకు తగ్గించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. సూక్ష్మ సేద్యం మంజూరులో కూడా అంతులేని జాప్యం జరుగుతోంది. మరో 45 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్నా.. తగ్గించిన లక్ష్యంలో ఇప్పటి వరకు 50 శాతం వరకు కూడా సాధించక పోవడం గమనార్హం. సూక్ష్మ సేద్యం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు భారీగా ఉండగా.. ఇప్పటి వరకు మంజూరు చేసింది నామమాత్రమే. కర్నూలు జిల్లాలో 3,439 హెక్టార్లకు, నంద్యాల జిల్లాలో 3,307 హెక్టార్లకు మాత్రమే సూక్ష్మ సేద్యం మంజూరు అయింది. దీన్ని బట్టి చూస్తే మంజూరు చేసింది 50 శాతం లోపే ఉండటం గమనార్హం.

### రైతుల ఆశలపై నీళ్లు..

సూక్ష్మ సేద్యానికి ఇస్తున్న సబ్సిడీలను కూటమి ప్రభుత్వం పెంచుతుందని రైతులు ఆశించారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో 5 ఎకరాల్లోపు రైతులందరికి 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్యం, 55 శాతం సబ్సిడీపై తుంపర్ల సేద్యం మంజూరు చేస్తుంది. కూటమి ప్రభుత్వం యథాతథంగా ఇవే సబ్సిడీలను అమలు చేస్తుందని, 5 ఎకరాలలోపు రైతులకు 100 శాతం సబ్సిడీ లభిస్తుందని ఆశించారు. అలాగే 10 ఎకరాల వరకు 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తుందని అనుకున్నారు. సబ్సిడీల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యాలను కూడా సగానికిపైగా తగ్గించడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పొరుగు రాష్ట్రాల మద్యం కట్టడికి పటిష్ట చర్యలు

- నాటుసారాను జిల్లాలో సమూలంగా నిర్మూలించాలి
- క్షేత్రస్థాయి అధికారులకు ఎక్సైజ్ నోడల్ డీసీ ఆదేశం



ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో ఎక్సైజ్ నేరాలపై సమీక్షిస్తున్న నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: ఏపీలో మద్యం ధరలు పెరిగినందున పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి వచ్చే అవకాశం ఉందని, కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ అధికారులతో మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెరిగిన మద్యం ధరలకు సంబంధించి ధరల పట్టిక బోర్డులను ప్రతి మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ కేసులకు సంబంధించి దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఆరా తీస్తూ వాటి దర్యాప్తుపై తగు సూచనలు ఇచ్చారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసిన వెంటనే చార్జీ షీట్లు వేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐలను ఆదేశించారు. మద్యం ధరల ఉల్లంఘనలపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు. నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చి నాలుగు మాసాలు పూర్తయినప్పటికీ చాలా దుకాణాల వద్ద డిస్‌ప్లే బోర్డులు కనిపించడం లేదన్నారు. నాన్ బెయిలబుల్ పెండింగ్ కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని చెప్పారు. అలాగే ఎక్సైజ్ నేరాలకు సంబంధించిన ముద్దాయిలు వచ్చే నెల నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు.

**బెల్టు దుకాణాలను సహించేది లేదు**

పల్లెల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డీసీ సూచించారు. శివరాత్రి పండుగ సందర్భంగా పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి దిగుమతి అయ్యే అవకాశమున్నందున ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసి రైడ్స్ నిర్వహించాలన్నారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను తక్షణమే వేలం ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారాను జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 110, నంద్యాల జిల్లాలో 116 నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో పూర్తిగా సారా తయారీని రూపు మాపేందుకు స్టేషన్ల వారీగా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. నవోదయ 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్నందున నాటుసారా తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నంద్యాల, కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రవికుమార్, సుధీర్ బాబు, ఏఈఎస్‌లు రాముడు, రామకృష్ణారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్‌తో పాటు 14 ఎక్సైజ్ స్టేషన్లు, 7 సరిహద్దు చెక్‌పోస్టుల సీఐలు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## 'మనమిత్ర వాట్సాప్' ద్వారా మల్లన్న సేవా టికెట్లు

శ్రీశైలం: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునే భక్తులు ఆర్జిత సేవా టికెట్లు, శీఘ్ర దర్శనం, స్పర్శ దర్శనం టికెట్లను మనమిత్ర వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా పొందవచ్చునని శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో దర్శనం టికెట్లు, సేవా టికెట్లను ప్రభుత్వం ఈ వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చిందన్నారు. భక్తులు నిర్ణీత రుసుము చెల్లించి వాటిని పొందవచ్చన్నారు. ప్రస్తుతానికి ఈ వాట్సాప్ ద్వారా 161 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో శ్రీశైలానికి సంబంధించి గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతి హోమం, రుద్ర హోమం, మహా మృత్యుంజయ హోమం, చండీ హోమం, కల్యాణోత్సవం, అన్నప్రాసన, అక్షరాభ్యాసన మొదలైన 17 ఆర్జిత సేవలకు సంబంధించిన సేవా టికెట్లు పొందవచ్చునని చెప్పారు.

### 47 మంది గైర్హాజర్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షల్లో 61 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్షలు 11, బీఈడీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరిగాయి. డిగ్రీ పరీక్షలకు 260 మందికి 213 మంది హాజరు కాగా 47 మంది గైర్హాజరయ్యా రని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బీఈడీ పరీక్షలకు 92 మందికి 78 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారన్నారు.

## కాలినడక భక్తులకు విస్తృత ఏర్పాట్లు



వెంకటాపురం సమీపంలో భక్తుల కాలినడక మార్గాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలం/ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రానికి కాలినడకన వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె శ్రీశైలంలోని కైలాస ద్వారం నుంచి అటవీ మార్గంలోని తుమ్మల బైలు, పెచ్చేరువు, నాగులూటి గూడెం, వెంకటాపురం వరకు ప్రయాణిస్తూ ఏఏ ప్రదేశాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కె. శ్రీనివాసరావు, డీఎఫ్ఓ అబ్దుల్ రవూఫ్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. తుమ్మలబైలు నుంచి పెచ్చేరువుకు వెళ్లే అటవీ మార్గంలో పెద్ద పులి పాద ముద్రలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత వివరాలను అటవీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపురం నుంచి కైలాస ద్వారం వరకు 46 కిలోమీటర్ల మార్గంలో భక్తులు కాలినడకన ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ఈ మార్గంలో గుర్తించిన 12 ప్రదేశాల్లో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, షెడ్లు, భోజన వసతి, వైద్య సదుపాయం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా భక్తులు కాలినడకన ప్రయాణించే అటవీ మార్గమంతా కోర్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్ట్ క్రిందకు వస్తుందన, దీనిని దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. భక్తులు తమ వెంట ఉన్న పదార్థాలను ఎక్కడంటే అక్కడ పారేయకుండా ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలన్నారు. అటవీ మార్గంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వారికి వెంటనే ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దాదాపు 8 నుంచి 10 లక్షల మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ఎలాంటి తొక్కిసలాటలు లేకుండా చూడాలన్నారు.

## క్లుప్తంగా

### అహోబిలేశుడి సేవలో హీరో ధరమ్‌తేజ్



దిగువ అహోబిలం ఆలయంలో హీరో ధరమ్‌తేజ్

**ఆళ్లగడ్డ:** అహోబిల లక్ష్మీనరసింహస్వామి వార్లను సినీ హీరో సాయిధరమ్‌తేజ్ మంగళవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివార్ల చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు.

### ఖురాన్ పఠనంలో హఫీజ్ ప్రతిభ



ఖురాన్ చదివిన హఫీజ్ సలీం

**ఎమ్మిగనూరు రూరల్:** స్థానిక నూరని మజీద్ మదరసా ఇస్లామీయ సుల్తానుల ఉలూమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఖురాన్ పఠనం పోటీల్లో పదేళ్ల హఫీజ్‌సలీం సలీం ప్రతిభ కనబరిచాడు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన హజిసబ్ కుమారుడు హఫీజ్‌సలీం 30 అధ్యాయాల ఖురాన్ గ్రంథాన్ని 11 గంటల్లో చూడకుండా పఠించాడని మతపెద్దలు మౌలాన ముఫ్తీ అబ్దుల్లా లతీఫ్, ముఫ్తీ మన్సూర్‌సాబ్, కారిహఫీజ్, ఇనాయతుల్లాసాబ్ తెలిపారు. అనంతరం హఫీజ్ సలీంను పలువురు మత పెద్దలు అభినందించారు.

### డ్రిప్ ఇరిగేషన్‌తో బహుళ ప్రయోజనాలు

- ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

**తుగ్గలి:** డ్రిప్ ఇరిగేషన్‌తో ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి అన్నా రు. తుగ్గలి, జీ.ఎర్రగుడి, జొన్నగిరి గ్రామాల తోటల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న సబ్సిడీ కింద మంజూరైన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆమె పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ బిందు సేద్యంతో తక్కువ నీటితో పంటలు పండించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ ఏడాది 7వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 3,500 హెక్టార్లకు మంజూరు చేశామని, మార్చిలోగా లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. దరఖాస్తు చేస్తున్న అర్హులైన రైతులకు త్వరితగతిన డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. ఆమె వెంట ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్ జయరామిరెడ్డి, కొఠారి డ్రిప్ కంపెనీ డీసీవో ఆర్వేటి రాము,ఎసీవో రాజేష్, డీలర్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

### మోసగాళ్ల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు

**కోవెలకుంట్ల:** విదేశీ కరెన్సీ ఆశ చూపి ఇద్దరు అమాయకులను మోసం చేసిన నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నంద్యాలకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా, శ్రీనివాసులుకు గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు రూ.20 లక్షల విలువ చేసే డాలర్లు ఇస్తామని చెప్పి వారి వద్ద నుంచి ఇటీవల కోవెలకుంట్లలో రూ.10 లక్షల నగదు తీసుకుని ఉడాయించిన ఘటనపై పోలీసులు ఈనెల 8న కేసు నమోదు చేశారు. మోసగాళ్లను పట్టుకునేందుకు సీఐ హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, రేవనూరు ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. మోసగాళ్ల సెల్‌ఫోన్, సీసీ ఫుటేజీ ఆధారంగా ఒకటి, రెండు రోజుల్లో కేసును ఛేదించనున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

# ‘అడవి’ తల్లికి రక్షణ!

- అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- ఫైర్ వాచర్లతో నిరంతర పర్యవేక్షణ
- పటిష్టంగా 30 కి.మీ. ఫైర్ లైన్స్ ఏర్పాటు
- అగ్ని ప్రమాదాల నివారణ చర్యలకు రూ.5 లక్షల నిధులు

వేసవి వచ్చిందంటే అగ్ని ప్రమాదాల భయం వెంటాడుతుంది. తెలిసో తెలియకో చేస్తున్న మానవ తప్పిదాలు అడువులను కాల్చి వేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో అడవుల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. జంతుజాతులను కాపాడుకునేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నారు. అరుదైన వృక్షాల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టారు. పక్షులు ఇతర జీవుల దాహార్తి తీర్చేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిప్పు రాజుకున్నా.. మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేసేందుకు ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

– కర్నూలు కల్చరల్

వేసివి కాలం నేపథ్యంలో అటవీ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అడవులను అగ్నికీలల నుంచి కాపాడేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదాబాయి పర్యవేక్షణలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టంగా నిఘా పెడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా పలువురు అధికారులకు విధులు కేటాయించింది. అటవీ సంరక్షణ, అక్రమ రవాణా కట్టడికి గ్రామాల్లో కళాజాతా బృందాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

**ఫైర్ ఫైటింగ్ దళం**

అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో మంటలను అదుపు చేసేందుకు అటవీ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఆరుగురితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు పెట్రోలింగ్ చేయడంతోపాటు అడవిలో పరిస్థితులను గమనిస్తుంటారు. వారికి కావాల్సిన నీళ్ల బాటిళ్లు, బూట్లు, డ్రెస్, సేఫ్టీ కిట్స్‌ను అందించారు. కర్నూలు సిటీ ఫారెస్ట్, సోమయాజుల పల్లె ఫారెస్ట్ ప్రాంతాల్లో వీరు పెట్రోలింగ్ చేస్తుంటారు. అటవీ ప్రాంతంలో రాజుకునే మంటలను ఎస్ఎన్‌పీపీ శాటిలైట్ సహకారంతో డీఎఫ్‌ఓలు ఎప్పటికప్పుడు తెలుసుకుని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు

**పకడ్బందీగా ఫైర్ లైన్స్**

మంటలను అదుపు చేయడానికి వీలుగా అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంటలు వ్యాపించకుండా ఆర్పేందుకు వీలుగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు డివిజన్‌లో కర్నూలు నగర వనం, సోమయాజుల పల్లె ప్రాంతాల్లో 12 కి.మీ., ఆదోని డివిజన్‌లో 18 కి.మీ. మేర ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశారు. 8 నుంచి 10 మీటర్లు వెడల్పుతో ఒకే వరుసలో చెట్లను, ఎండుటాకులను తొలగిస్తున్నారు. దీంతో మంటలు ఎక్కడికక్కడ ఆగిపోయే అవకాశం ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

**జీవాలకు నీటి సౌకర్యం**

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రస్తుతం నీటి ఎద్దడి లేదు. అయినప్పటికీ వేసవి కారణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అటవీ ప్రాంతాల్లో కర్నూలు డివిజన్‌లో 12, ఆదోని డివిజన్‌లో 8 సాసర్ పిట్‌లను గుర్తించారు. ఇంకా అవసరమైన చోట్ల పిట్ లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.జంతువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

**అడవులను కాపాడుకోవాలి**



అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడుకోవాలి. ఇది అందరూ బాధ్యతగా భావించాలి. అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బందిని నియమించి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వారికి ఫైర్ బ్లోయర్స్ అందించాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వారు వెంటనే స్పందించి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటారు. అడవికి ఎవరూ నిప్పు పెట్టరాదు. దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలి. అడవి జంతువులను కాపాడుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సమష్టి కృషితోనే అటవీ సంరక్షణ సాధ్యం. ఫైర్‌లైన్స్, సాసర్ పిట్స్ ఏర్పాటు తదితర వాటికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశాం. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18004255909తోపాటు కర్నూలు ఎఫ్ఆర్ఓ 98859 45006, ఆదోని ఎఫ్ఆర్ఓ 93985 61626 నెంబర్లలకు సమాచారం ఇవ్వండి

– శ్యామల, జిల్లా అటవీ శాఖ అధికారి

**కర్నూలు జిల్లా అటవీ శాఖ స్వరూపం**

కర్నూలు జిల్లా అటవీ శాఖ మొత్తం విస్తీర్ణం: 35,127.80 హెక్టార్లు

| రేంజ్ పరిధులు.. | అటవీ విస్తీర్ణం |
|---|---|
| రేంజ్:కర్నూలు | రేంజ్: ఆదోని |
| సెక్షన్లు :2 | సెక్షన్లు: 3 |
| బీట్లు: 6 | బీట్లు: 11 |
| అటవీ విస్తీర్ణం: 15,276.21 హెక్టార్లు | అటవీ విస్తీర్ణం: 19,851.95 హెక్టార్లు |
| మండలాలు: వెల్దుర్తి, సి.బెళగల్, కర్నూలు గూడూరు, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు కృష్ణగిరి. | మండలాలు: కోసిగి, కౌతాళం, మంత్రాలయం నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని, హొళగుంద, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి, తుగ్గలి, మద్దికెర ఈస్ట్, చిప్పగిరి. |

## దుష్ప్రచారం సరికాదు

- మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**మంత్రాలయం:** తాను పార్టీ మారుతున్నట్లు కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని, ఇలాంటి దుష్ప్రచారం సరికాదని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం రాంపురం గ్రామంలోని తన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా తాను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానని, మరో పార్టీ వైపు చూస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రచారాలను ఆయన ఖండించారు. ‘దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తున్నా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకు మంత్రి పదవి దక్కలేదనే ఉద్దేశంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. ఇదంత అవాస్తవం. వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాలకు హాజరు కాలేక పోతున్నా. నేను అందుబాటులో లేకపోతే నా సోదరుడు టీటీడీ మాజీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, తనయులు వై.ప్రదీప్‌రెడ్డి, వై.ధరణీరెడ్డితో పాటు ఆయా మండలాల నాయకుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పార్టీకి ద్రోహం చేయడం కానీ, పార్టీ మారే ఆలోచన కానీ లేదు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం’ అని ధీమా వ్యక్తం చేశారు.

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


- ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



ఏపీడబ్ల్యూజేఎఫ్ కర్నూలు నగర నూతన కమిటీతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

**కర్నూలు:** జర్నలిస్టుల హక్కుల కోసం దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని, వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. కర్నూలులోని లలిత కళాసమితిలో మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాలు జర్నలిస్టులపై కక్ష కట్టి అక్రమంగా కేసులు బనాయిస్తున్నాయన్నారు. దేశంలో పలు రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక మెలికలతో కాలయాపన చేస్తుందన్నారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికి అక్రిడిటేషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, రాష్ట్ర నాయకులు బి.గోరంట్లప్ప, కేవీ శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుసేన్, సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య, పాణ్యం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల నాయకులు సుజాత, షబ్బీర్, తిమ్మప్ప, జిల్లా నాయకులు చంద్రమోహన్, మధు, బ్రహ్మయ్య, సునీల్ కుమార్, ఎర్రమల తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై హత్యాయత్నం



ఆదోనిలో చికిత్స పొందుతున్న దక్షణమూర్తి

**ఆస్పరి:** మండలంలోని కారుమంచి గ్రామంలో సోమవారం రాత్రి దక్షణమూర్తిపై అదే గ్రామానికి చెందిన చిన్న లింగన్న హత్యాయత్నం చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి దక్షణమూర్తి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా చిన్న లింగన్న పాత కక్షలు మనసులో పెట్టుకుని వేటకొడవలితో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. దాడిలో దక్షణమూర్తికి తలకు, చేయికి రక్తగాయలు కావడంతో చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్న లింగన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీలకు వెలుగోడు విద్యార్థి



నాగజశ్వంత్ రెడ్డి

**వెలుగోడు:** జాతీయస్థాయి కరాటే పోటీలకు తమ పాఠశాల విద్యార్థి నాగజశ్వంత్ రెడ్డి ఎంపికయ్యాడని స్థానిక లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానియేల్ తెలిపారు. విద్యార్థిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థి నాగజశ్వంత్‌రెడ్డి అండర్ -16 కుమతి విభాగంలో మొదటి స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

## ప్రాణ నష్టం జరిగే వరకు పట్టించుకోరా

- కుక్కలను చంపిన చిరుత

**డోన్ టౌన్:** చిరుత సంచరిస్తున్నా అటవీశాఖ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని, ప్రాణ నష్టం జరిగే వరకు పట్టించుకోరా అంటూ వెంకటాపురం, బొంతిరాళ్ల, కోయిలకొండ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వెంకటాపురం గ్రామ రైతు బోయ హనుమంతుకు చెందిన చీనితోటలో ఉన్న రెండు కుక్క పిల్లలను చిరుత చంపి తిన్నట్లు మంగళవారం ఉదయం గుర్తించాడు. గతంలో కూడా బొంతిరాళ్ల, కోయిలకొండ గ్రామాల్లోని కుక్కలను, పశువులను, గొర్రెలను చిరుత తిన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఘటనా ప్రదేశానికి వెళ్లి పాద ముద్రలు గుర్తించడం తప్ప చేసిందేమీ లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కాలంగా చిరుతల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నా వాటిని బంధించేందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా స్పందించి తమ ప్రాణాలు పోక ముందే చిరుతలను బంధించి వేరే చోటుకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

## సీమ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం వివక్ష

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



పెండింగ్ ప్రాజెక్టులపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డితో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

**కర్నూలు (టౌన్):** సీమ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మంగళవారం ఎస్వీ మోహన్ రెడ్డి, నీటి పారుదల నిపుణులు దశరథరామిరెడ్డి, నర్సిరెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పెండింగ్ ప్రాజెక్టులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో సాగునీరు, తాగునీరు అవసరాల కోసం, సీమ ప్రాంత అభివృద్ధికి సిద్దేశ్వరం ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్‌లను త్వరగా పూర్తి చేయాలన్న డిమాండ్‌ను కేంద్రం దృష్టికి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని చర్చించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల కోసం ఉద్యమం తప్పదన్నారు.

## ఏఈఓల రాష్ట్ర సంఘంలో జిల్లాకు సముచిత స్థానం

- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి



నాగేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

**కర్నూలు(అగ్రికల్చర్):** ఈనెల 9న విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఎన్నికల్లో ప్రధాన సెక్రటరీగా జిల్లాకు చెందిన నాగేశ్వరరెడ్డికి చోటు లభించడం సంతోషకరమని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నాగేశ్వరరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఏఈఓల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర స్థాయి సమస్యల పరిష్కారానికి నాగేశ్వరరెడ్డి ద్వారా రాష్ట్ర సంఘ నాయకల నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏఈఓల సమస్యలను జిల్లా స్థాయిలో డీఏఓ, రాష్ట్ర స్థాయిలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాషా, మనోహర్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



పెద్ద సోమప్ప(ఫైల్)

**సి.బెళగల్:** మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఇసుక లోడ్ టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాలు.. మండల కేంద్రం శివారులోని ముడుమాల రోడ్డు చింతమునిస్వామి ఆలయ వద్ద నివాముంటున్న బోయ గుండ్రేవుల పెద్ద సోమప్ప (55) మంగళవారం ఉదయం గద్వాలకు వెళ్లేందుకు రోడ్డుపై వేచి ఉండగా అదే సమయంలో తుంగభద్ర నదిలోని ఇసుక రీచ్ నుంచి లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో సోమప్ప వెనుక టైర్ కింది పడి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. వాహనం డోన్‌కు చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. మృతుడి కుమారుడు గుండ్రేవుల రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ‘జేఈఈ మెయిన్స్’లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



టి.మిథున్ సాయి, కె.జీవన్ కుమార్, కె.చరణ్ కుమార్, రెడ్డి ఉపేంద్ర రెడ్డి, పి.వెంకట విశాల్, వెంపాడ కైలాష్

- సాంకేతిక సమస్య వల్ల సర్వర్ డౌన్
- ఆలస్యంగా డౌన్‌లోడ్ అవుతున్న ఫలితాలు

**కర్నూలు (సిటీ):** జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం గత నెల 22వ తేదీన నిర్వహించిన ఉమ్మడి ప్రవేశపరీక్ష (జేఈఈ మెయిన్స్) మొదటి విడత పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షకు సంబంధించిన తుది కీ సోమవారం విడుదల అయింది. ఫలితాలను మంగళవారం విడుదల చేయగా సర్వర్ డౌన్ కావడంతో ఫలితాలు ఆలస్యంగా డౌన్‌లోడ్ అవుతున్నాయి. దీంతో ఇప్పటివరకు డౌన్‌లోడ్ అయిన ఫలితాల్లో అత్యధికంగా టి.మిథున్ సాయి 99.91 పర్సెంటైల్, కె.జీవన్ కుమార్ 99.84, కె.చరణ్ కుమార్ 99.83, ఎస్.శివ ధనుష్ 99.47, కె.సాయిశృతి 99.42, ఎం.డి.ఖాజా ఫాజుద్దీన్ అహ్మద్ 99.42, కె.సాయి భాస్కర్ 99.20, డి.ధరణి 99.08, రెడ్డి ఉపేంద్ర రెడ్డి 98.91, పి.వెంకటవిశాల్ 98.87, వెంపాడ కైలాష్ 97.53 పర్సెంటైల్ సాధించారు. నంద్యాల చెక్‌పోస్టుకు సమీపంలోని సనత్ నగర్‌లో ఉన్న ఐయాన్ డిజిటల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇంజినీరింగ్‌కు సంబంధించి గత నెల 22, 23, 24, 28, 29 తేదీల్లోను, ఆ తర్వాత బీఆర్క్(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్) గత 30వ తేదీన జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 3 వేల మంది హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయి.



ఎ. నవీన్ , కె. రామ్ మనోహర్, బి. నవదీప్, ఎం. నాగ కార్తిక్ రెడ్డి, వై. రాజు

**చిన్న టేకూరు విద్యార్థుల ప్రతిభ**

**కల్లూరు:** జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన ఎ. నవీన్ 97.61 పర్సంటైల్, కె.రామ్ మనోహర్ 94.84, బి. నవీన్ 94.37, ఎం. నాగ కార్తీక్ రెడ్డి 93.95, వై. రాజు 93.84 పర్సంటైల్ సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, అధ్యాపకులను, అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్పను సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి అభినందించారు.

## గిరిజనుల హక్కులను కాలరాస్తే సహించం

**డోన్:** గిరిజనుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలేటి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణ కవచంలా ఉండే 1-70 చట్టానికి తూట్లు పొడిచేలా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఇదే ప్రయత్నం చేసి గిరిజనుల ఆగ్రహానికి గురైన సంగతిని అయ్యన్నపాత్రుడు మరిచిపోయినట్లున్నారన్నారు. టూరిజం అభివృద్ధి పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏలూరు, పార్వతీపురంతో పాటు మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాన్ని అతిక్రమిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప గిరిజనులకు, ఆదివాసీయులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదన్నారు. అలాంటి ఆలోచనను విరమించుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు పోతురాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యువతిని రక్షించిన పోలీసులు



పోలీసులతో ఉమామహేశ్వరి

**శ్రీశైలం:** క్షేత్ర పరిధిలోని పాతాళగంగలో దూకి ఆత్మహత్య కు యత్నించిన తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా మోచర్ల గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి(26)ని వన్‌టౌన్ పోలీసులు రక్షించారు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. ఉమామహేశ్వరి అదృశ్యంపై వనపర్తి జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా యువతి శ్రీశైలంలో ఉన్నట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు గురవయ్య, నానునాయక్, నాగవేణి వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. పాతాళగంగ సమీపంలో ఉమామహేశ్వరి ఉన్నట్లు తెలుసుకొని ఆమెను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**బొమ్మలసత్రం:** నంద్యాల శివారులోని వెంకటేశ్వరపురం గ్రామం వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేశం లభ్యమైనట్లు ఎస్ఐ జలీల్ తెలిపారు. మృతుడు రైలు నుంచి జారీ కిందపడి మృతిచెందినట్లు అనుమానిస్తున్నామన్నారు. 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, నల్లని టీషర్టు, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్, బ్రౌన్ కలర్ బెల్ట్ ధరించి ఉన్నాడన్నారు. కుడిచేతికి రత్నం అని పచ్చబొట్టు ఉందని, మృతుడి వివరాల కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.